నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి..
www.suryaepaper.com

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
మంగళవారం
27-01-2026
పేజీలు: 02

# రణబాలి గ్లింప్స్‌కు ఏఐ వాడలేదు.. దర్శకుడు క్లారిటీ




విజయ్ దేవరకొండ కథానాయకుడిగా దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రాబోతున్న 'రణబాలి' టైటిల్ గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్న విషయం తెలిసిందే. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విడుదలైన ఈ వీడియోలోని అద్భుతమైన విజువల్స్ చూసి, ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో రూపొందించినదని పలు జర్నలిస్ట్‌లతో పాటు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయితే ఈ వార్తలపై దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ స్పందిస్తూ.. 'రణబాలి' గ్లింప్స్‌లో ఎక్కడా AI వాడలేదని స్పష్టమైన వివరణ ఇచ్చారు. ఇందులోని ప్రతి ఫ్రేమ్‌ను సాంకేతిక బృందం ఎంతో కష్టపడి సంప్రదాయ పద్ధతుల్లోనే డిజైన్ చేసిందని, కేవలం ఈ చిన్న వీడియో కోసమే తమ టీమ్ కొన్ని నెలల పాటు శ్రమించిందని ఆయన వెల్లడించారు. 'టాక్సీవాలా' తర్వాత రాహుల్ దర్శకత్వంలో వస్తున్న ఈ పీరియడ్ డ్రామా 1854 – 1878 మధ్య బ్రిటిష్ పాలన కాలం నాటి వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతోంది. రష్మిక మందన్న 'జయమ్మ' పాత్రలో నటిస్తుండగా, అజయ్-అతుల్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. విజయ్ దేవరకొండను ఒక వీరుడిలా చూపిస్తూ భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ చిత్రం సెప్టెంబర్ 11, 2026న విడుదల కానుంది.

# మోదీకి దగ్గరవుతున్న శశిథరూర్



కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ పార్టీకి క్రమంగా దూరమవుతున్నారనే ఊహాగానాలు ఇప్పుడు తీవ్రంగా వినిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఆయన బీజేపీ నేతలతో సన్నిహితంగా కనిపిస్తున్నారు. ప్రధాని మోదీని పదే పదే మెచ్చుకుంటూ వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇటీవల రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన కీలక సమావేశానికి కూడా శశిథరూర్ హాజరు కాలేదు. దీంతో పార్టీలో విభేదాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. కేరళ అసెంబ్లీ ఎన్నికలు త్వరలోనే జరగనున్న నేపథ్యంలో, ఇలాంటి విభేదాలు పార్టీకి నష్టం కలిగించవచ్చని కాంగ్రెస్ సీనియర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దిద్దుబాటు చర్యలు చేపట్టాలని పార్టీ భావిస్తోంది. శశిథరూర్ ఫిర్యాదులను పరిష్కరించేందుకు సీనియర్ నేతలు ఆయనను ప్రైవేట్‌గా ఆహ్వానించవచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇది బహిరంగ వేదికపై కాకుండా, పార్టీ అంతర్గతంగా జరగాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో శశిథరూర్ తన స్పందన వెల్లడించారు. పీటీఐతో ఆయన మాట్లాడుతూ, "నా సొంత పార్టీ నాయకత్వంతో చర్చించాల్సిన సమస్యలు ఉన్నాయి. బహిరంగ వేదికపై కాదు... నేను పార్లమెంటు కోసం ఢిల్లీకి వెళ్తాను. నా ఆందోళనలను పార్టీ నాయకత్వానికి స్పష్టంగా తెలియజేయడానికి.. వారి అభిప్రాయాన్ని తెలుసుకోవడానికి.. సరైన సంభాషణ జరపడానికి నాకు అవకాశం లభిస్తుందని నేను నమ్ముతున్నాను" అన్నారు. "నేను గత 17 సంవత్సరాలుగా కాంగ్రెస్‌లో ఉన్నాను. మనం ఎక్కువ దూరం వెళ్లకూడదు. నా విషయానికొస్తే.. ఏదైతే తప్పు జరిగిందో.. దానిని పరిష్కరించాల్సిన అవసరం ఉంది. తగిన వేదికలో అది పరిష్కరించబడుతుంది" అని స్పష్టం చేశారు.


శశిథరూర్ ఇటీవలి వ్యాఖ్యల్లో ప్రధాని మోదీని ప్రశంసించడం, బీజేపీ నేతలతో సన్నిహితంగా కనిపించడం పార్టీలో చర్చకు దారితీసింది. మోదీ రాజ్యాంగాన్ని పవిత్రంగా భావిస్తారని, దానిని తిరస్కరించిన వారిని తనిఖీ చేయాలని ఆయన అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు పార్టీలో అసంతృప్తిని పెంచాయి. రాహుల్ గాంధీతో జరిగిన కీలక మీటింగ్‌కు హాజరు కాకపోవడం విభేదాలను మరింత బహిర్గతం చేసింది. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఈ విషయాన్ని పరిష్కరించడానికి సన్నద్ధమవుతోంది. కేరళ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, పార్టీ ఐక్యత ముఖ్యమని సీనియర్లు భావిస్తున్నారు. శశిథరూర్‌తో ప్రైవేట్ చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని పార్టీ ప్లాన్ చేస్తోంది. మరి ఈ చర్చలు ఎలా సాగుతాయి? శశిథరూర్ పార్టీలోనే కొనసాగుతారా? లేక మరో మార్గం ఎంచుకుంటారా? అనేవి రాబోయే రోజుల్లో తేలనున్నాయి.

# సిరై మూవీ రివ్యూ



'ప్రేమ' అనే రెండు అక్షరాలకు సరైన నిదర్శనాలు చూపించలేము .. నిర్వచనాలు చెప్పలేము. విడిపోతే బ్రతకలేనిది ప్రేమనో .. బ్రతుకున్నత వరకూ విడిపోలేనిది ప్రేమనో తేల్చి చెప్పడం చాలా కష్టం. పున్నమి వెన్నెల .. సముద్రం మాదిరిగా ప్రేమ కూడా ఎప్పుడూ కొత్తగానే కనిపిస్తుంది .. కొత్త అనుభూతులనే పంచుతుంది. అలాంటి ఒక ప్రేమకథనే 'సిరై'. క్రితం ఏడాది డిసెంబర్ 25న థియేటర్లకు వచ్చిన ఈ తమిళ సినిమా, ఈ నెల 26వ తేదీ నుంచి 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది. శ్రీను (విక్రమ్ ప్రభు) ఓ పోలీస్ కానిస్టేబుల్. అబ్దుల్ (అక్షయ్ కుమార్) అనే ఒక ఖైదీని 'శివగంగై' కోర్టుకు తరలించవలసి వస్తుంది. శ్రీనుతో పాటు, పాండు – మురళి అనే కానిస్టేబుల్స్ కూడా ఖైదీతో పాటు ఒక బస్సులో బయల్దేరతారు. అబ్దుల్ ఒక మర్డర్ చేయడం వలన జైలుకు వస్తాడు. ఐదేళ్లుగా అతను కోర్టు చుట్టూ తిరుగుతూ ఉంటాడు. తల్లి కూడా చనిపోవడంతో అనాథగా మిగిలిపోయిన అతణ్ణి జామీన్ పై బయటకి తీసుకుని వచ్చేవారు లేకుండా పోతారు. తనని కోర్టుకు తీసుకుని వెళ్లే ముందు తనకి చేతికి గల బేడీలు తీసేయమని శ్రీనుని అబ్దుల్ కోరతాడు. హంతకులకు బేడీలు తీయకూడదని శ్రీను తేల్చి చెబుతాడు. అప్పటి నుంచి అబ్దుల్ ఆ పోలీసుల నుంచి తప్పించుకునే అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉంటాడు. అలాంటి పరిస్థితులలో ఒక 'ధాబా' దగ్గర బస్సును ఆపుతారు. అబ్దుల్ తో పాటు బస్సులో మురళి ఉండగా, హోటల్ బయట ఒక ప్రయాణీకుడితో పాండు గొడవ పడతాడు. బస్సులో నుంచి అది చూసిన మురళి అక్కడికి పెరిగెత్తుకు వెళతాడు. అదే సమయంలో శ్రీను కూడా ఆ గొడవ దగ్గరికి చేరుకుంటాడు. అక్కడి గొడవ సద్దుమణిగేలా చేస్తాడు. ఈ లోగా అబ్దుల్ ఉన్న బస్సు అక్కడి నుంచి వెళ్లిపోతుంది. తన 'గన్' కూడా బస్సులోనే ఉండిపోయిందని శ్రీనుతో మురళి చెబుతాడు. దాంతో శ్రీను నివ్వెరపోతాడు. అబ్దుల్ ను వాళ్లు తిరిగి పట్టుకోగలుగుతారా? అతను హత్య చేసింది ఎవరిని? ఎందుకోసం హత్య చేశాడు? కోర్టు దగ్గర బేడీలు తీసేయమని అతను ఎందుకు రిక్వెస్ట్ చేశాడు? అనేది కథ. నిజమైన ప్రేమ .. నిస్వార్థమైన ప్రేమ .. నిజాయితీ కలిగిన ప్రేమ .. ఈ రోజులలో కనుమరుగవుతోంది. ఆకర్షణని ప్రేమ అనుకుని .. ఆ భ్రమలో బ్రతుకుతున్న జంటలే ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. అవసరాన్ని బట్టి పుట్టే ప్రేమలు, అవకాశాన్ని బట్టి మారిపోవడమే ఎక్కువగా అనుభవంలోకి వస్తుంటాయి. ట్రెండ్ కి తగినట్టుగానే ప్రేమ పేరుతో చాలా సినిమాలు తెరపైకి వస్తున్నాయి. అవసరమైన ఫీల్ లేకపోవడంతో రెండో రోజున అదృశ్యమైపోతున్నాయి. అలాంటి ఈ ట్రెండులో వచ్చిన సినిమానే 'సిరై'. ఇది ఒక పల్లెటూరి ప్రేమకథ. తల్లికోసం జైలుపాలై, ప్రేమించిన అమ్మాయి కోసం విడుదల కావాలనుకునే ఒక హంతకుడి కథ. అతని విడుదల కోసం వేయికళ్లతో ఎదురుచూసే ఒక ప్రియురాలి కథ. వాళ్లకి అండగా నిలబడటం కోసం తన ఉద్యోగాన్ని .. అధికారాన్ని పక్కన పెట్టిన ఒక సాధారణ కానిస్టేబుల్ కథ. మనసున్న ప్రతి ఒక్కరినీ ఏడిపించే కన్నీటి కథ ఇది. దర్శకుడు ఈ కథాకథనాలను డిజైన్ చేసుకున్న తీరు గొప్పగా అనిపిస్తుంది. ముగ్గురులు పోలీసులు ఒక హంతకుడిని వెంటబెట్టుకుని కోర్టుకు బయల్దేరుతారు. దార్లో ఏం జరుగుతుంది? ఆ యువకుడు ఎందుకు హత్య చేశాడు? ఎవరిని హత్య చేశాడు? అనే విషయాన్ని తెలుసుకోవడం కోసమే ప్రేక్షకులు సిద్ధంగా ఉంటారు. ఆ సమయంలో ఆ నేరస్థుడి పట్ల పోలీసులు ఎంత కఠినంగా ఉంటారో .. ప్రేక్షకులు కూడా అదే భావనతో ఉంటారు. కథ కొంత దూరం వెళ్లిన తరువాత, ఆ యువకుడు ఆ కేసు నుంచి బయటపడాలి .. ప్రేమించిన అమ్మాయిని చేరుకోవాలి .. అందుకుగల అడ్డంకులు తొలగిపోవాలని దేవుళ్లకి దణ్ణాలు పెట్టుకోని ప్రేక్షకులు ఉండరు. అంత సహజంగా ఈ కథను .. పాత్రలను ప్రేక్షకుల హృదయాలకు సమీపంగా తీసుకుని వెళ్లిన దర్శకుడిని అభినందించకుండా ఉండలేం. 'మన కోసం ఎదురుచూసే మనిషి కోసం మనం బ్రతకాలి. మన కోసం బ్రతికే మనిషి కోసం మనం ఎంతకాలమైనా ఎదురుచూడాలి' అనే ఒకే ఒక లైన్ పై నడిచిన కథ ఇది. నిజమైన నేరస్థులు శిక్షించబడాలి. కానీ అనుకోకుండా జరిగిన సంఘటనల వలన నేరస్థులుగా మిలిపోయిన వాళ్లు ఎంతోమంది ఉన్నారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ .. జైళ్లలోనే మగ్గుతున్నారు. అలాంటివారికి తమ పరిస్థితిని చెప్పుకునే అవకాశం ఇవ్వాలి .. వినడానికి అధికారులు సమయం కేటాయించాలి అనే సందేశాన్ని ఇస్తూ సాగే ఈ కథ .. అందరినీ ఆలోచింపజేస్తుంది.

# ప్లాస్టిక్‌తో పెను ముప్పు.. 2040 నాటికి రెట్టింపు ఆరోగ్య సమస్యలు




ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికే కాకుండా, మానవ ఆరోగ్యానికి కూడా తీవ్ర ముప్పు పొంచి ఉందని తాజా అధ్యయనం ఒకటి హెచ్చరించింది. ప్రస్తుత పద్ధతుల్లో ఎటువంటి మార్పులు తీసుకురాకపోతే 2040 నాటికి ప్లాస్టిక్ వ్యవస్థ నుంచి వెలువడే ఉద్గారాల వల్ల ఆరోగ్య సమస్యలు రెట్టింపు అయ్యే ప్రమాదం ఉందని ఇవాళ ప్రచురితమైన ఈ అధ్యయనం స్పష్టం చేసింది. ఈ పరిశోధన వివరాలు ప్రతిష్ఠాత్మక 'ది లాన్సెట్ ప్లానెటరీ హెల్త్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ప్లాస్టిక్ తయారీకి ముడిసరుకులైన శిలాజ ఇంధనాల వెలికితీత నుంచి, ఉత్పత్తి, వినియోగం, పారవేయడం వరకు ప్రతి దశలోనూ ఆరోగ్యానికి హాని కలుగుతున్నట్లు ఈ అధ్యయనం గుర్తించింది. గ్రీన్‌హౌస్ వాయువులు, గాలిని కలుషితం చేసే కణాలు, విష రసాయనాలు ప్రధానంగా ప్లాస్టిక్ ఉత్పత్తి ప్రక్రియల నుంచే విడుదలవుతున్నాయని తెలిపింది. ప్రస్తుత విధానాలే కొనసాగితే, 2040 నాటికి ప్లాస్టిక్ వల్ల కలిగే ఆరోగ్య నష్టాల్లో 40 శాతం గ్రీన్‌హౌస్ వాయువుల వల్ల, 32 శాతం వాయు కాలుష్యం వల్ల, 27 శాతం విష రసాయనాల వల్ల సంభవిస్తాయని పరిశోధకులు అంచనా వేశారు. లండన్ స్కూల్‌కు చెందిన పరిశోధకురాలు మేగన్ డీనీ మాట్లాడుతూ.. "ప్లాస్టిక్ జీవిత చక్రంలో వెలువడే ఉద్గారాలు క్యాన్సర్లు, ఇతర అసంక్రమిత వ్యాధులకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా ప్లాస్టిక్ ఉత్పత్తి, దానిని బహిరంగంగా కాల్చడం వల్లే ఎక్కువ హాని జరుగుతోంది" అని వివరించారు. కేవలం వ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్ మెరుగుపరచడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని, దీనికి బదులుగా అనవసరమైన ప్లాస్టిక్ ఉత్పత్తిని గణనీయంగా తగ్గించి, కఠిన నిబంధనలు అమలు చేయాలని పరిశోధకుల బృందం ప్రభుత్వాలకు సూచించింది.



# అనసూయకు గుడి కడతాడట..
# పర్మిషన్ అడుగుతున్న పూజారి

టాలీవుడ్‌లో గ్లామరస్ నటిగా మాత్రమే కాకుండా, బలమైన నటనతో అందరి మనసులను అనసూయ గెలిచింది. యాంకర్ గా తన కెరీర్ ను మొదలుపెట్టిన ఆమె సినీ రంగంలోకి వచ్చిన తర్వాత ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. ఇప్పుడు కొంతమంది ఆమెకు గుడి కట్టడానికి కూడా సిద్ధమవుతున్నారు. అనసూయ పర్మిషన్ ఇస్తే ఏకంగా ఆమెకు గుడి కట్టేస్తామని పూజారి మురళీశర్మ బహిరంగంగా ప్రకటించడం సంచలనంగా మారింది. తమిళనాడులో నటి ఖుష్బూకు గుడి కట్టిన తరహాలోనే అనసూయకు కూడా ఆలయం నిర్మిస్తామని ఆయన ధీమాగా చెప్పారు. ఇటీవల ఒక యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూలో మురళీశర్మ మాట్లాడుతూ, "అనసూయ అంటే నాకు అపారమైన గౌరవం. ఆమె పర్మిషన్ ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకుని గుడి కడతాం. ఖుష్బూకు గుడి లాగే అనసూయకు కూడా ఆలయం నిర్మిస్తాం" అని స్పష్టంగా ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇటీవల శివాజీ-అనసూయ వివాదంలో కూడా మురళీశర్మ అనసూయ వ్యాఖ్యలకు మద్దతు ప్రకటించారు. ఆమెకు మద్దతుగా మాట్లాడుతూ వీడియోలు రిలీజ్ చేశారు. అనసూయ అభిమాన సంఘం అధ్యక్షుడిగా కూడా ఆయన గుర్తింపు పొందారు. మరి, మురళీశర్మ విన్నపం పట్ల అనసూయ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# సిగరెట్ లైటర్ కోసం గొడవ..
# ఫ్రెండ్‌ను కారుతో గుద్ది హతమార్చిన వ్యక్తి

సిగరెట్ లైటర్ కోసం ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన గొడవ ఒకరి ప్రాణాన్ని బలితీసుకుంది. మరొకరి నాలుక తెగి, తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ జిల్లా కమ్మసంద్రలో ఈ దారుణ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటకలోని కమ్మసంద్రలో క్రికెట్ పోటీలకు ఇద్దరు స్నేహితులు ప్రశాంత్ (35), రోషన్ హెగ్డే వెళ్లారు. మ్యాచ్ ముగిసిన తర్వాత ఇద్దరు మద్యం సేవించారు. ఈ క్రమంలో స్నేహితులు ఇద్దరి మధ్య సిగరెట్ లైటర్ విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవ ముదరడంతో బీర్ బాటిళ్లతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో రోషన్ హెగ్డే నాలుకకు తీవ్రగాయమైంది. తీవ్ర గాయాలు కావడంతో భయపడిపోయిన రోషన్ తన కారులో అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించాడు. కానీ ప్రశాంత్ అతన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. కారు డోర్ పట్టుకుని అడ్డగించేందుకు చూశాడు. దీంతో ప్రశాంత్‌ను అలాగే కారుతో ఈడ్చుకెళ్లి వేగంగా చెట్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ప్రశాంత్ మృతికి కారణమైన రోషన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రోషన్ నాలుక తెగిపోవడంతో పాటు తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేటు ఆస్పత్రిలో అతనికి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఈ గొడవకు సంబంధించిన దృశ్యాలు కారు డ్యాష్‌బోర్డు కెమెరాలో రికార్డయ్యాయి.








# మోహన్ బాబుకు అరుదైన గౌరవం

తెలుగు సినిమాలో కలెక్షన్ కింగ్‌గా పేరు తెచ్చుకున్న లెజెండరీ నటుడు మోహన్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. 77వ రిపబ్లిక్ డే సందర్భంగా పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీ.వి. ఆనంద్ బోస్ చేతుల మీదుగా 'గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డు'ను ఆయన అందుకున్నారు. తెలుగు నటుడికి ఈ అవార్డు దక్కడం ఇదే తొలిసారి కావడం విశేషం. కోల్‌కతాలోని లోక్ భవన్‌లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో మోహన్ బాబు ఈ అవార్డును అందుకున్నారు. అనంతరం జరిగిన 'ఎట్ హోం' రిసెప్షన్‌లో కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఫొటోల్లో మోహన్ బాబు వెంట మంచు విష్ణు, నటుడు శివబాలాజీలు కూడా కనిపిస్తున్నారు. మోహన్ బాబు దాదాపు 50 సంవత్సరాలకు పైగా తెలుగు సినీ పరిశ్రమలో విలన్, హీరో, తండ్రి పాత్రల్లో అదరగొట్టారు. 'కలెక్షన్ కింగ్'గా ప్రసిద్ధి చెందిన ఆయన, అనేక సూపర్ హిట్ సినిమాల్లో నటించారు. తన సొంత బ్యానర్ పై ఎన్నో చిత్రాలను నిర్మించారు. పాటు సామాజిక సేవల్లో కూడా ముందుండి... పేద విద్యార్థులకు ఉచిత విద్య, స్కాలర్‌షిప్‌లు అందిస్తూ ఎంతో మందికి సహాయం చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు ఈ అవార్డు దక్కడం తెలుగు సినీ పరిశ్రమకు, సామాజిక సేవకులకు గర్వకారణంగా నిలిచింది.



## 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' అన్న ప్రధాని మోదీ
# భారత్-ఈయూ వాణిజ్య ఒప్పందం

భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (FTA)పై ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది అన్ని ఒప్పందాలకూ తల్లి లాంటిదని (మదర్ ఆఫ్ ఆల్ డీల్స్) అభివర్ణించారు. ఈ ఒప్పందం ఖరారైతే ఇరు ఆర్థిక వ్యవస్థల మధ్య తయారీ, సేవా రంగాలకు భారీ ఊతం లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇండియన్ ఎనర్జీ వీక్ సదస్సులో వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధాని, ఈ ఒప్పందంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోందని తెలిపారు. "భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య ఒక చరిత్రాత్మక ఒప్పందం కుదరబోతోంది. ప్రపంచంలోని అనేక దేశాలు దీనిని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా చర్చిస్తున్నాయి. ఈ డీల్ 140 కోట్ల మంది భారతీయులకు, యూరప్‌లోని లక్షలాది ప్రజలకు అపారమైన అవకాశాలను సృష్టిస్తుంది" అని మోదీ అన్నారు. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య సహకారానికి ఈ ఒప్పందం ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధాని పేర్కొన్నారు. ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో (జీడీపీ) దాదాపు 25 శాతం, ప్రపంచ వాణిజ్యంలో మూడింట ఒక వంతు వాటా ఈ ఒప్పంద పరిధిలోకి వస్తుందని వివరించారు. ఈ డీల్ ద్వారా భారత్‌లోని టెక్స్‌టైల్స్, జెమ్స్ అండ్ జ్యూవెలరీ, లెదర్ వస్తువుల వంటి రంగాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ ఒప్పందం కేవలం వాణిజ్యానికే కాకుండా ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలన వంటి ఉమ్మడి విలువల పట్ల నిబద్ధతను కూడా బలపరుస్తుందని మోదీ స్పష్టం చేశారు. భారత్-యూకే వాణిజ్య ఒప్పందానికి ఈ డీల్ అదనపు బలాన్ని ఇస్తుందని ఆయన జోడించారు.

# 17 ఏళ్ల కెరీర్‌కు గుడ్‌బై.. రిటైరైన ఆస్ట్రేలియా పేసర్




ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్, టీ20 స్పెషలిస్ట్ కేన్ రిచర్డ్‌సన్ తన 17 ఏళ్ల సుదీర్ఘ ప్రొఫెషనల్ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు అన్ని రకాల ఫ్రాంచైజీ లీగ్‌ల నుంచి తప్పుకుంటున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించాడు. 2021లో టీ20 ప్రపంచకప్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టులో రిచర్డ్‌సన్ సభ్యుడిగా ఉన్నాడు. ఆస్ట్రేలియా తరఫున 25 వన్డేలు, 36 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన రిచర్డ్‌సన్, దేశవాళీ క్రికెట్‌లో తనదైన ముద్ర వేశాడు. ముఖ్యంగా బిగ్ బాష్ లీగ్ (BBL) చరిత్రలో అత్యంత విజయవంతమైన బౌలర్లలో ఒకరిగా నిలిచాడు. 15 సీజన్లలో 142 వికెట్లు పడగొట్టి, బీబీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన ఐదో బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తరఫున 80 మ్యాచ్‌ల్లో 104 వికెట్లు తీసి, ఆ జట్టు తరఫున ఆల్-టైమ్ లీడింగ్ వికెట్ టేకర్‌గా ఉన్నాడు. కేవలం ఆస్ట్రేలియాకే పరిమితం కాకుండా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్, పూణె వారియర్స్ వంటి జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ఇంగ్లండ్, యూఏఈలోని లీగ్‌లలో కూడా పాల్గొన్నాడు. ఇటీవలి కాలంలో గాయాలతో ఇబ్బంది పడుతున్న 34 ఏళ్ల రిచర్డ్‌సన్, బీబీఎల్ 15వ సీజన్‌లో సిడ్నీ సిక్సర్స్ తరఫున తన చివరి మ్యాచ్‌లు ఆడాడు.



# కానిస్టేబుల్ సౌమ్య పరిస్థితి విషమం

నిజామాబాద్ జిల్లాలో గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో కారుతో ఢీకొట్టబడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. హైదరాబాద్‌లోని నిమ్స్ వైద్యులు తాజాగా విడుదల చేసిన హెల్త్ బులిటెన్‌లో ఆమె ఆరోగ్య స్థితిని వివరించారు. నిమ్స్ వైద్యుల ప్రకారం, కారు కడుపు పైభాగానికి ఢీకొట్టడంతో లివర్, కిడ్నీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పక్కటెముకలు విరిగిపోయాయి. ఎడమ కిడ్నీని తొలగించాల్సి వచ్చింది. ఇప్పటికీ ఆమె పరిస్థితి విషమంగానే ఉంది. అయితే, వైద్యానికి సహకరిస్తున్నారని వైద్యులు తెలిపారు. ఆమెను ఐసీయూలో ఉంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు వెల్లడించారు. రక్తనాళాలు, శ్వాసకోశ వ్యవస్థలపై కూడా ప్రభావం పడింది. మరిన్ని టెస్టులు, చికిత్సలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నిజామాబాద్ జిల్లాలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, గంజాయి ముఠా సభ్యులు కారుతో సౌమ్యను ఢీకొట్టారు. తీవ్ర గాయాలపాలైన ఆమెను మొదట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎక్సైజ్ శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు. గంజాయి ముఠా సభ్యులను పట్టుకోవడానికి ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ దాడి ప్రభుత్వానికి, పోలీసు శాఖకు షాక్ ఇచ్చింది. సౌమ్య త్వరగా కోలుకుని మళ్లీ డ్యూటీకి హాజరవ్వాలని అందరూ ఆశిస్తున్నారు. ఈ ఘటన రాష్ట్రంలో మత్తు పదార్థాల అక్రమ రవాణాపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలనే చర్చను లేవనెత్తింది.



# చిక్కుల్లో స్టార్ నటి సిడ్నీ స్వీనీ

హాలీవుడ్ నటి సిడ్నీ స్వీనీ తాజాగా వివాదంలో చిక్కుకుంది. ఆమె తన కొత్త లాంజేరీ బ్రాండ్ ప్రమోషన్ కోసం ఒక సాహసం చేయగా.. ఆ స్టంట్ ఇప్పుడు ఆమెను చిక్కుల్లో పడేసింది. లాస్ ఏంజెల్స్‌లోని ప్రపంచ ప్రసిద్ధ 'హాలీవుడ్' సైన్ బోర్డుపైకి ఎక్కి, అక్కడ బ్రాలను వరుసగా వేలాడదీయడం అంతర్జాతీయంగా పెద్ద చర్చకు దారితీసింది. తన బ్రాండ్ ప్రచారం కోసం అర్ధరాత్రి సమయంలో టీమ్‌తో కలిసి హాలీవుడ్ కొండపైకి వెళ్లిన ఆమె, అక్కడి భారీ అక్షరాలలో ఒకదానిపైకి ఎక్కి ఈ పని చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. అయితే, ఆ ప్రాంతంలో షూటింగ్ చేసుకోవడానికి ఆమెకు అనుమతి ఉన్నప్పటికీ, ఐకానిక్ హాలీవుడ్ బోర్డును తాకడానికి లేదా దానిపైకి ఎక్కడానికి హాలీవుడ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి ఎటువంటి అనుమతి తీసుకోలేదని సమాచారం.




# మళ్లీ మొదటికొచ్చిన సెన్సార్ వివాదం

దళపతి విజయ్ హీరోగా నటించిన 'జన నాయగన్' సినిమాకు మద్రాస్ హైకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ జారీ చేయాలంటూ గతంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ ఇవాళ కొట్టివేసింది. దీంతో సినిమా విడుదల మరింత ఆలస్యం కావడం ఖాయంగా కనిపిస్తోంది. సెన్సార్ బోర్డు తన వాదనలు వినిపించడానికి (కౌంటర్ దాఖలు చేయడానికి) సింగిల్ జడ్జి తగిన సమయం ఇవ్వలేదని డివిజన్ బెంచ్ అభిప్రాయపడింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (CBFC) నుంచి క్లియరెన్స్ వస్తేనే 'జన నాయగన్' థియేటర్లలో విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మద్రాస్ హైకోర్టులో ఈ కేసుపై తాజాగా విచారణ ప్రారంభం కానుంది. విజయ్ పూర్తిస్థాయి రాజకీయాల్లోకి రాకముందు నటించిన చివరి చిత్రంగా ప్రచారం జరుగుతున్న 'జన నాయగన్', సంక్రాంతి సందర్భంగా ఈ నెల 9న విడుదల కావాల్సి ఉంది. అయితే, ఓ ఫిర్యాదు ఆధారంగా సినిమాను రివైజింగ్ కమిటీకి పంపినట్లు సెన్సార్ బోర్డు నిర్మాతలకు తెలిపింది. దీంతో నిర్మాతలు కేవీఎన్ ప్రొడక్షన్స్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా, మార్పుల తర్వాత సినిమాకు 'యూ/ఏ' సర్టిఫికెట్ ఇవ్వాలని సింగిల్ బెంచ్ ఆదేశించింది. ఈ తీర్పుపై సెన్సార్ బోర్డు అప్పీల్ చేయడంతో డివిజన్ బెంచ్ స్టే విధించింది. నిర్మాతలు సుప్రీంకోర్టును ఆశ్రయించినా, తిరిగి హైకోర్టునే సంప్రదించాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. హెచ్. వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, మమితా బైజు, గౌతమ్ వాసుదేవ్ మీనన్, ప్రకాశ్ రాజ్, నరైన్, ప్రియమణి కీలక పాత్రలు పోషించారు.



# సంతోష్ రావుపై కవిత సంచలన ఆరోపణలు

బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్ రావుపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి సంతోష్ గూఢచారి అని, ఉద్యమకారులను కేసీఆర్ కు దూరం చేశాడని ఆరోపించారు. గద్దర్ లాంటి ఉద్యమకారులు ప్రగతిభవన్ బయట పడిగాపులు కాయడానికి కారణం సంతోష్ రావు అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సంతోష్ రావును సిట్ విచారణకు పిలవడంపై కవిత స్పందించారు. విచారణ సంగతేమో కానీ ఈ కేసులో ఆయనకు శిక్ష పడుతుందనే నమ్మకం లేదని చెప్పారు. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందేనని అన్నారు. ఇటీవల గంజాయి స్మగ్లర్లు దాడి చేయడంతో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ సౌమ్యను మంగళవారం కవిత పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎంపీ, కేసీఆర్ సన్నిహితుడు సంతోష్ రావుపై తీవ్ర ఆరోపణలు చేశారు.